



EVENING EDITION

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

4PM
www.suryaa.com
శుక్రవారం
13-02-2026
పేజీలు: 02




## కరీంనగర్ కార్పొరేషన్‌లో అధిక్యంలో కమలం..!

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఒక్కొక్కటిగా వెలువడుతున్నాయి. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా ఫలితాల్లో అధికార పార్టీ కాంగ్రెస్ ముందంజలో ఉంది. ఉత్తర తెలంగాణలో హోరా హోరీగా సాగుతోంది. ముఖ్యమంత్రి కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఇప్పటి వరకు అందించిన లెక్కల ప్రకారం భారతీయ జనతా పార్టీ ముందంజలో ఉంది. మొదటి రౌండ్ ముగిసే వరకు మొత్తం 66 డివిజన్లలో 36 స్థానాల్లో బీజేపీ అధిక్యత కొనసాగుతోంది. కాంగ్రెస్ పార్టీ 12 డివిజన్లు, బీఆర్ఎస్ — 03, ఎంఐఎం 2 డివిజన్లతో సత్తా చాటాయి. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్ నిర్వహించారు. ఇందులో భాగంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మొత్తం 66 డివిజన్లకు పోలింగ్ జరిగింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 100.07 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. మొత్తం జనాభా 3,94,669 మంది. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మొత్తం 2,72,665 మంది ఓటర్లుగా ఉన్నారు. ఇందులో 1,37,516 మంది పురుషులు, 1,35,149 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. కరీంనగర్ జనాభాలో 9.15 శాతం షెడ్యూల్డ్ కులాలు, 1.64 శాతం షెడ్యూల్డ్ తెగలు ఉన్నాయి. కాగా, అతితక్కువగా 62.98 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. 2020 ఎన్నికలతో పోలిస్తే కరీంనగర్‌లో ఒక శాతం ఎక్కువగా నమోదైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. గత కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు 2020లో జరిగాయి. ఇందులో భారత రాష్ట్ర సమితి (BRS) 33 సీట్లతో ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. భారతీయ జనతా పార్టీ (BJP) 13 సీట్లను గెలుచుకుంది. ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (AIMIM) ఆరు సీట్లను గెలుచుకుంది. ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు కార్పొరేటర్లుగా విజయం సాధించారు. ఇక ఈసారి ఫలితాల్లో భారతీయ జనతా పార్టీ ఏకపక్షంగా విజయం దిశగా పరుగులు పెడుతోంది.



### నల్గొండలో కాంగ్రెస్ ప్రభంజనం.. కార్పొరేషన్‌తో పాటు

## 6 మున్సిపాలిటీలు క్లీన్ స్వీప్

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో ఉమ్మడి నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని మరోసారి రుజువు అయ్యింది. జిల్లాలోని ప్రధాన మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు అన్ని మున్సిపాలిటీలను కైవసం చేసుకుని కాంగ్రెస్ ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. ముఖ్యంగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రత్యర్థులకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా భారీ మెజారిటీతో పీఠాన్ని మేయర్ దక్కించుకుంది.

నల్గొండ కార్పొరేషన్‌లో ఏకపక్ష విజయం

నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మొత్తం 48 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ అద్భుత ప్రదర్శన కనబరిచింది. కాంగ్రెస్ 35 స్థానాలతో అదరగొట్టగా.. బీఆర్ఎస్ 10 స్థానాలు, బీజేపీ 02, స్వతంత్రులు ఒక స్థానంలో విజయం సాధించారు. ఈ విజయంతో కార్పొరేషన్ పీఠంపై హస్తం పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమైంది.

జిల్లా వ్యాప్తంగా హస్తం హవా..

నల్గొండ జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లోనూ కాంగ్రెస్ జైత్రయాత్ర కొనసాగింది. చండూరు నుంచి నందికొండ వరకు అన్ని చోట్లా ప్రత్యర్థులు కనీస పోటీ ఇవ్వలేకపోయారు. మిర్యాలగూడ, దేవరకొండ, చిట్యాల, హాలియా, నందికొండ, చండూరు కాంగ్రెస్ సత్తా చాటింది. ప్రధానంగా హాలియా, నందికొండ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ దాదాపు క్లీన్ స్వీప్ చేసింది. 12 వార్డులకు గాను రెండింటిలోనూ చెరో 11 స్థానాలను దక్కించుకుని తిరుగులేని ఆధిపత్యాన్ని చాటుకుంది. అతిపెద్ద మున్సిపాలిటీ అయిన మిర్యాలగూడలో 31 స్థానాలతో స్పష్టమైన మెజారిటీ సాధించింది. కాగా నల్గొండ జిల్లా ఫలితాలు కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. అభివృద్ధి మంత్రం, ప్రభుత్వ పథకాలే తమను గెలిపించాయని కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్, బీజేపీలు కొన్ని స్థానాలకే పరిమితం కావడం గమనార్హం.

### నేరేడుచర్ల మున్సిపాలిటీలోని 14వ వార్డులో

## గెలుపొందిన జనసేన అభ్యర్థి




మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ బోణి కొట్టింది. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీలోని 14వ వార్డులో జనసేన అభ్యర్థి సమీప ప్రత్యర్థిపై విజయకేతనం ఎగురవేశారు. ఈ విజయం జనసేన శ్రేణుల్లో మంచి ఉత్సాహాన్ని నింపింది.పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నేరుగా ప్రచారంలో పాల్గొనకపోయినా, స్థానిక నాయకత్వం, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చేసిన కృషి ఈ గెలుపుకు కీలకంగా నిలిచింది. ముఖ్యంగా యువత, మార్పు కోరుకునే ఓటర్లు జనసేన వైపు మొగ్గు చూపినట్టు తెలుస్తోంది. తెలంగాణలో బలపడాలని చూస్తున్న జనసేనకు ఈ విజయం ఎంతో ఉత్సాహాన్ని ఇస్తుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

### చిట్యాల మున్సిపాలిటీలో

## ట్రాన్స్‌జెండర్ శ్వేత సుధాకర్ గెలుపు



రాష్ట్రంలో రెండు కార్పొరేషన్‌లు, 116 మున్సిపాలిటీలకు ఇటీవల పోలింగ్ జరిగింది. ఇవాళ కౌంటింగ్ నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల ఫలితాల్లో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. నల్గొండ జిల్లాలోని చిట్యాల మున్సిపాలిటీలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన ఓ ట్రాన్స్‌జెండర్ విజయం సాధించారు. ట్రాన్స్‌జెండర్ శ్వేత సుధాకర్ చిట్యాల మున్సిపాలిటీలోని 1వ వార్డు నుంచి బరిలో దిగారు. ఎన్నికల ప్రచారంలో శ్వేత సుధాకర్ వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీ అభివృద్ధి లక్ష్యంగా సుధాకర్ ఇచ్చిన హామీలు ఓటర్లను ఆకట్టుకున్నాయి. దాంతో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులను కాదని ఓటర్లు శ్వేత సుధాకర్‌ను గెలిపించుకున్నారు.



## సంగారెడ్డి, సదాశివపేటలో జగ్గారెడ్డిదే పైచేయి!

ఎన్నో ఉద్రిక్తతలు, వివాదాల నడుమ జరిగిన సంగారెడ్డి, సదాశివపేట మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన చింతా ప్రభాకర్ ఉన్నా, మాజీ మంత్రి హరీశ్ రావు ఈ రెండు మున్సిపాలిటీల్లో విస్తృతంగా ప్రచారం చేసినా ఫలితాలు మాత్రం కాంగ్రెస్‌కు అనుకూలంగా వచ్చాయి. మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిసెంట్ జగ్గారెడ్డి బీఆర్ఎస్ పార్టీపై పైచేయి సాధించారు. జగ్గారెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైనా ఏదో ఓ కార్యక్రమంలో జనాల మధ్య ఉండటం కాంగ్రెస్ పార్టీ విజయానికి కలిసొచ్చింది. సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల్లో విజయమే లక్ష్యంగా జగ్గారెడ్డి భార్య, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల, కొడుకు, కూతురు.. ఇలా కుటుంబమంతా కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ఇంటింటా ప్రచారం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించి సంగారెడ్డిలో ఆధిపత్యం కొనసాగిద్దామనుకున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్,



మాజీ మంత్రి హరీశ్ రావుకు చివరకు తీవ్ర నిరాశ మిగిలింది. సదాశివపేట మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 26 వార్డులు ఉండగా కాంగ్రెస్ పార్టీ 16 , బీఆర్ఎస్ పార్టీ 8 , బీజేపీ 1, స్వతంత్రులు ఒక్క స్థానంలో గెలిచారు. చైర్మన్ పదవికి కావాల్సిన మ్యాజిక్ ఫిగర్ మెజారిటీ సీట్లను గెలుచుకున్న కాంగ్రెస్ పార్టీ చైర్మన్ పీఠం ఎక్కనుంది. సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో 38 వార్డులు ఉండగా ఇప్పటి వరకు ప్రకటించిన ఫలితాల్లో కాంగ్రెస్ 19 వార్డులు, బీఆర్ఎస్ 9, బీజేపీ 2, ఎంఐఎం 2 వార్డులు గెలిచారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో కుడా ఎవరి మద్దతు అవసరం లేకుండా కాంగ్రెస్ చైర్మన్ అయ్యే అవకాశం

## డాన్స్‌తో ఇంటర్నెట్‌ని షేక్ చేస్తోన్న పూజా హెగ్డే

బుట్టబొమ్మ పూజా హెగ్డే ఈ ఏడాది మూడు సినిమాలతో మెరిసింది. రెండు చిత్రాల్లో(దేవా, రెట్రో) హీరోయిన్‌గా నటించగా, మరో మూవీలో స్పెషల్ సాంగ్ చేసింది. రజనీకాంత్ `కూలీ`లో ఆమె స్పెషల్ సాంగ్‌లో మెరిసిన విషయం తెలిసిందే. `మోనికా` అంటూ ఉర్రూతలూగించింది. ఆ పాట విపరీతంగా ఆకట్టుకుంది. చాలా రోజులపాటు ఇందులో పూజా స్టెప్పులు, ఆమెతోపాటు సౌబిన్ డాన్స్ వైరల్‌గా మారింది. ఇక ఇప్పుడు మరో పాటతో దుమ్మురేపుతోంది పూజా హెగ్డే. దళపతి విజయ్‌తో కలిసి అదిరిపోయే స్టెప్పులేసింది. తాజాగా ఆమె డాన్స్ క్లిప్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.పూజా హెగ్డే తాజాగా దళపతి విజయ్‌తో కలిసి `జన నాయకుడు` చిత్రంలో నటిస్తోంది. మమితా బైజు మరో హీరోయిన్. హెచ్ వినోద్ దర్శకత్వంలో ఈ చిత్ర రూపొందుతుంది. కేవీఎన్ ప్రొడక్షన్ నిర్మిస్తోంది. ప్రస్తుతానికి విజయ్ నటిస్తోన్న చివరి చిత్రమిదే. ఆయన రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన నేపథ్యంలో ఈ సినిమా తర్వాత విజయ్ పూర్తిగా రాజకీయాలపై ఫోకస్ పెట్టబోతున్నారు. దీంతో ఈ సినిమా చేస్తున్నారు. దీన్ని చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుని రూపొందిస్తున్నారు దర్శకుడు వినోద్. ఇందులో విజయ్‌తో రొమాన్స్ చేస్తోంది పూజా.




## పాక్‌తో మ్యాచ్‌లో అభిషేక్ ఆడే అవకాశం ఉంది

టీ20 వరల్డ్‌కప్‌లో ఆదివారం పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ఆడే అవకాశాలు ఉన్నట్లు భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తెలిపాడు. కడుపు ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న అభిషేక్.. గురువారం నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో ఆడని విషయం తెలిసిందే. అయితే అభిషేక్ శర్మ ఆరోగ్యం ప్రస్తుతం బాగానే ఉన్నట్లు వరుణ్ చెప్పాడు. ఆరోగ్యం క్షీణించడం వల్ల రెండు రోజుల పాటు అభిషేక్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాడు. అభిషేక్‌తో మాట్లాడానని, అతను బాగానే ఉన్నాడని, ఇవాళ కొంత ప్రాక్టీస్ చేశాడని, సిద్ధం అవుతున్నట్లు అతను చెప్పాడని వరుణ్ చక్రవర్తి పేర్కొన్నాడు. నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో వరుణ్ చక్రవర్తి రెండు ఓవర్లు వేసి 7 పరుగులిచ్చి మూడు వికెట్లు తీసుకున్నాడు. ఆ మ్యాచ్ టాస్ వేసిన సమయంలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఒకటి లేదా రెండు మ్యాచ్‌లు అభిషేక్ శర్మ మిస్సయ్యే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్న విషయం తెలిసిందే. అభిషేక్ శర్మ గైర్హాజరీలో నమీబియాతో మ్యాచ్‌లో సంజూ శాంసన్ ఓపెనింగ్ బాధ్యతలు చేపట్టాడు. వరల్డ్‌కప్‌లో ఇండియా వరుసగా తన రెండో మ్యాచ్ నెగ్గింది. నమీబియాపై 93 రన్స్ తేడాతో నెగ్గింది. ఒకవేళ కొలంబోలో జరిగే ప్రాక్టీస్ సెషన్‌లో అభిషేక్ పాల్గొంటే అతను పాక్‌తో మ్యాచ్‌కు ఆడేది లేనిది తేలే అవకాశం ఉంటుంది.



## కోవా బన్ వ్యాపారికి పరిటాల శ్రీరామ్ మద్దతు

కోవా బన్ విక్రయించే ఒక చిరు వ్యాపారి జీవితాన్ని రోడ్డుపైకి లాగడం దారుణమని మాజీ ఎమ్మెల్యే పరిటాల శ్రీరామ్ ( ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా వేదికగా ఆ వ్యాపారికి మద్దతు తెలుపుతూ ఒక పోస్ట్ చేశారు. ఆకలికి కులం ఉండదని, అలాగే ఆత్మగౌరవానికి మతం ఉండదని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. కష్టపడి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే ప్రతి ఒక్కరినీ గౌరవించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని ఆయన గుర్తుచేశారు. యూట్యూబ్‌లో కేవలం వ్యూస్, లైక్స్ సంపాదించడం కోసమే కొంతమంది ఇలాంటి అమానవీయ పనులకు ఒడిగడుతున్నారని శ్రీరామ్ విమర్శించారు. వీలైతే పేదవారికి అండగా నిలబడాలి తప్ప, వారి గొంతు నొక్కడం సరైన పద్ధతి కాదని ఆయన హితవు పలికారు. సదరు వ్యాపారికి అండగా నిలుస్తూ ఈ ఘటనను ఖండిస్తున్న ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.



## 2029లో దేశవ్యాప్తంగా 'జమిలి' ఎన్నికలు జరుగుతాయి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా మీడియాతో మాట్లాడుతూ పలు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాబోయే పదిన్నరేళ్ల పాటు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని, తనకు రాష్ట్రంలో ఎవరూ పోటీ లేరని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలోనే కాకుండా, ప్రతిపక్షాల్లో కూడా తనకు పోటీ ఇచ్చే నాయకుడు లేడని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి.2029లో దేశవ్యాప్తంగా 'జమిలి' ఎన్నికలు జరుగుతాయని రేవంత్ రెడ్డి జోస్యం చెప్పారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, జూబ్లీహిల్స్‌లో దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఎన్టీఆర్ జాతీయ నాయకుడని, ఆయనకు సరిహద్దులు లేవని కొనియాడారు. ఈ ప్రకటనను రాజకీయ వర్గాలు వ్యూహాత్మక ఎత్తుగడగా విశ్లేషిస్తున్నాయి.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

## అందాలతో కాకరేపుతున్న రకుల్

సల్మాన్ ఖాన్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న పాపులర్ షో బిగ్‌బాస్ సీజన్ 19లో రకుల్ ప్రీత్ సింగ్ టీం సందడి చేసింది. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఫస్ట్ పార్ట్‌లో తనకంటే వయసులో చాలా చిన్నదైన ఆయేషా (రకుల్ ప్రీత్ సింగ్)ను ప్రేమ పెళ్లి చేసుకోవాలి అనుకున్న ఆశిష్ (అజయ్ దేవగణ్) తన మాజీ భార్య (టబు) పర్మిషన్‌తోపాటు ఆమె కుటుంబం అంగీకారాన్ని పొందడానికి ప్రయత్నిస్తాడు. ఆయేషా కుటుంబాన్ని ఆశీష్ ఎలా పెళ్లికి ఒప్పిస్తాడు అనే నేపథ్యంలో సీక్వెల్ సాగనుందని ఇప్పటికే ట్రైలర్ హింట్ ఇచ్చేస్తుంది. సీక్వెల్‌లో ఆయేషా తండ్రి రోల్‌లో కోలీవుడ్ స్టార్ యాక్టర్ ఆర్. మాధవన్ నటిస్తున్నాడు.



## ‘ఫంకీ’ మూవీ రివ్యూ





యూత్‌లో మంచి ఫాలోయింగ్ ఉన్న విశ్వక్‌సేన్ కథానాయకుడిగా ‘జాతిరత్నాలు’ వంటి బ్లాక్‌బాస్టర్ చిత్రానికి దర్శకుడైన కె.వి.అనుదీప్ దర్శకత్వంలో సినిమా అనగానే ‘ఫంకీ’పై ఆడియన్స్‌లో ఓ పాజిటివ్ బజ్ మొదలైంది. పైగా ప్రతిష్టాత్మక నిర్మాణం సంస్థ సితార ఎంటర్‌టైన్మెంట్స్ నుంచి వస్తున్న చిత్రం కావడంతో కచ్చితంగా సినిమా బావుంటుందనే అంచనాలో ప్రేక్షకులు ఉన్నారు. మరి అందరి అంచనాలనూ ‘ఫంకీ’ అందుకున్నదా? కె.వి.అనుదీప్ ‘జాతిరత్నాలు’ లాంటి మ్యాజిక్ మళ్లీ చేశాడా? విశ్వక్‌సేన్‌ని విజయం వరించిందా? ఈ ప్రశ్నలకు సమాధానం కావాలంటే ముందు కథలోకి వెళ్లాలి. కోమల్(విశ్వక్‌సేన్) దర్శకుడిగా తొలి సినిమా చేస్తుంటాడు. అనుకున్న దానికంటే బడ్జెట్ పెంచేయడంతో అవకాశం ఇచ్చిన నిర్మాత అనారోగ్యపాలవుతాడు. తన తండ్రిని ఈ స్థితికి తెచ్చిన కోమల్‌పై నిర్మాత కూతురు చిత్ర(కయాదు లోహర్)కి చెప్పలేనంత కోపం వస్తుంది. కోమల్‌ని దర్శకుడిగా తీసేస్తుంది. సినిమా ఆపేస్తుంది. ఇక ఎలాగోలా చిత్ర కోపాన్ని తగ్గించి సినిమాలు మళ్లీ మొదలుపెట్టాలని కోమల్ శతవిధాలా ప్రయత్నిస్తుంటాడు. ఓ దశలో చిత్ర ఒప్పుకుంటుంది. మిగిలిన సినిమాను తాను చెబుతున్న బడ్జెట్‌లో కాకుండా కేవలం కోటి రూపాయల్లో పూర్తి చేయాలనే షరతుతో సినిమాను మళ్లీ మొదలుపెడుతుంది చిత్ర. ఈ ప్రయాణంలో కోమల్, చిత్ర మధ్య ప్రేమ చిగురిస్తుంది. ఇంతకీ కోమల్ అనుకున్న బడ్జెట్‌లో సినిమా పూర్తి చేయగలిగాడా? నిర్మాత కుమార్తె చిత్రను పెళ్లాడగలిగాడా? సినిమా తెరకెక్కించే క్రమంలో కోమల్‌కు ఎదురైన సమస్యలేంటి? వాటిని తను ఎలా అధిగమించాడు? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ. దర్శకుడు అనుదీప్ కేవలం నవ్వించడానికే ఈ సినిమా తీసినట్టు అనిపిస్తుంది. కథలో కామెడీ ఉండాలి కానీ.. సినిమానే కామెడీ కాకూడదు. ఓ సింపుల్ లైన్‌ని సినిమాగా తీసుకొని ఫన్ మోడ్‌లో సినిమా అంతటినీ నడిపించాడు దర్శకుడు అనుదీప్. ఈ సినిమాలోని ప్రధాన పాత్రలతో పాటు మధ్య వచ్చి వెళ్లిపోయే పాత్రలు సైతం సైటైర్లు వేస్తుంటాయి. దీనికోసం దర్శకుడు రాసుకున్న ఫన్నీ వన్‌లైనర్లు కొన్ని చోట్ల బాగానే పేలాయి. ఈ కథలో హీరోయిన్‌ని హీరో ప్రేమిస్తాడు. కానీ అమ్మతో కాసేపు ఫోన్లో మాట్లాడటాన్ని మాత్రం గలీజుగా ఫీలవుతాడు. బంధాలంటే అతనికి గలీజు. అది తప్పని హీరోయిన్‌ని ప్రేమించిన తర్వాత తెలుసుకుంటాడు. దీన్ని బట్టి హీరో పాత్ర చిత్రణని అర్థం చేసుకోవచ్చు. మొత్తంగా దర్శకుడు అనుదీప్ ఈ కథలో బంధాలకు విలువివ్వాలని చెప్పాడు. హీరోహీరోయిన్ల మధ్య ప్రేమ ఉంటుంది.. కానీ వ్యక్తపరచుకునే అవకాశం, సందర్భం వారిద్దరికీ రాదు. ఈ నేపథ్యంలో ఇద్దరూ పడిన అంతర్మథనం బావుంది. అక్కడక్కడ దిల్‌రాజు, నాగవంశీ, కల్యాణ్‌కృష్ణ, హరీష్‌శంకర్, చిత్ర దర్శకుడు కె.వి. అనుదీప్.. వీరంతా సందర్భానుసారం అలా కనిపించి, ఇలా మాయమై సినిమాకు నిండుదనాన్ని తెచ్చారు. మొత్తంగా సినిమా ఆద్యంతం నవ్విస్తూ, నవ్వించడానికి ప్రయత్నిస్తూ సాగింది. విశ్వక్‌సేన్ ఎప్పటిలాగే తనదైన జోష్‌తో ఆకట్టుకుంటాడు. ఈ కథలో ఆయన కొత్తగా చేయడానికి ఏం లేదు. ఉన్నంతలో బాగా చేశాడు. కథానాయిక కయాదు లోహర్ ఈ సినిమాకు స్పెషల్ అట్రాక్షన్. తను చాలా అందంగా కనిపించింది. అంతే అందంగా నటించింది కూడా. నిర్మాత కూతురుగా ఆమె నటన ఈ సినిమాకు హైలైట్. ఇక నరేష్ ఎప్పటిలాగే తనదైన నటనా పటిమతో ఆడియన్స్‌ని కట్టిపడేస్తారు. మిచ్చి సంపత్ ఇందులో జీకే.. అనే కామెడీ విలన్‌గా కనిపిస్తారు. ఆయన కూడా అక్కడక్కడ నవ్విస్తారు. ఇక ఈ సినిమాలోని మిగతా తారాగణం కూడా పరిధిమేర రక్తికట్టించారు. కె.వి. అనుదీప్ సినిమా నేపథ్యంలో కూడిన కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ కథ రాసుకున్నాడు. కథలో ఇంకాస్త సీరియస్‌నెస్ ఉంటే బావుండేది. కథ ఆద్యంతం లైటర్‌వేలో సాగింది. కథలో సంఘర్షణలు తక్కువ. అక్కడక్కడ హీరోకు ఎదురయ్యే సమస్యలను కూడా కామెడీగా సాగాయి. మొత్తంగా ఆడియన్స్‌ని నవ్వించే విషయంలో కొంతమేర కె.వి.అనుదీప్ సక్సెస్ అయ్యారని చెప్పొచ్చు. భీమ్స్ సిసిరోలియో సంగీతం బావుంది. కెమెరా వర్క్ డల్‌గా అనిపించింది. కలర్ గ్రేడింగ్ సరిగ్గా చేస్తే బావుండేది.

## నారా లోకేశ్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన బండ్ల గణేష్




సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ గురువారం రాష్ట్ర మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఉండవల్లిలోని లోకేశ్ నివాసంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా, ఇటీవల తాను పూర్తి చేసిన 'సంకల్ప పాదయాత్ర' గురించి మంత్రికి బండ్ల గణేశ్ వివరంగా తెలిపారు.షాద్‌నగర్ నుంచి తిరుమల వరకు 535 కిలోమీటర్ల పాటు 23 రోజుల పాటు సాగిన తన పాదయాత్ర అనుభవాలను, దాని వెనుక ఉన్న ఉద్దేశాన్ని లోకేశ్‌తో పంచుకున్నారు. అనంతరం, శ్రీవారి దర్శనం తర్వాత స్వీకరించిన తీర్థ ప్రసాదాన్ని లోకేశ్‌కు అందజేశారు.




## పుట్టుకతో వచ్చిన కులం మారదన్న అలహాబాద్ హైకోర్టు

వివాహం లేదా మత మార్పిడి కారణంగా ఒక వ్యక్తి పుట్టుకతో వచ్చిన కులం మారదని అలహాబాద్ హైకోర్టు చారిత్రక తీర్పు వెలువరించింది. ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసులో నిందితులు దాఖలు చేసిన క్రిమినల్ అప్పీల్‌ను కొట్టివేస్తూ జస్టిస్ అనిల్ కుమార్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని ఎస్సీ వర్గానికి చెందిన ఓ మహిళపై దినేశ్ అనే వ్యక్తితో పాటు మరో 8 మంది దాడి చేసి, కులం పేరుతో దూషించారు. ఈ ఘటనలో బాధితురాలితో సహా ముగ్గురు గాయపడ్డారు. దీంతో బాధితురాలు వారిపై అలీగఢ్‌లోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఐపీసీతో పాటు ఎస్సీ/ఎస్టీ చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఈ కేసులో విచారణకు హాజరు కావాలని ప్రత్యేక న్యాయస్థానం నిందితులను ఆదేశించింది.అయితే, బాధితురాలు జాట్ కమ్యూనిటీకి చెందిన వ్యక్తిని వివాహం చేసుకోవడం వల్ల ఆమె ఎస్సీ హోదా కోల్పోయిందని, కాబట్టి తమపై ఎస్సీ/ఎస్టీ చట్టం వర్తించదని వాదిస్తూ నిందితులు హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు.ఈ అప్పీల్‌పై ఫిబ్రవరి 10న విచారణ జరిపిన న్యాయస్థానం, నిందితుల వాదనను తోసిపుచ్చింది. "ఒక వ్యక్తి మతం మారినా, పెళ్లి చేసుకున్నా పుట్టుకతో వచ్చిన కులం మారదు. కాబట్టి పిటిషనర్ల వాదన నిరాధారమైనది" అని జస్టిస్ అనిల్ కుమార్ తన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. క్రాస్ కేసు ఉండటం అనేది ఫిర్యాదును కొట్టివేయడానికి ఒక కారణంగా పరిగణించలేమని పేర్కొంటూ, నిందితుల అప్పీల్‌ను కొట్టివేశారు.

## ఒక్క ఓటుతో గెలిచిన అదృష్టవంతులు వీరే



తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ఒక్క ఓటుతో గెలిచిన అభ్యర్థులు ఇప్పుడు ట్రెండింగ్ లోకి వచ్చేశారు. అదృష్టం వారికి ఒక్క ఓటు రూపంలో దక్కిందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఇప్పటి వరకు మూడు చోట్ల ఒక్క ఓటుతో అభ్యర్థులు గట్టెక్కారు. వారి గురించి ఒకసారి చూద్దాం.

కల్వకుర్తిలో..

కల్వకుర్తి మున్సిపాలిటీలోని పదో వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి ఎజాస్ మొదటి సారి లెక్కించినప్పుడు రెండు ఓట్ల తేడాతో గెలుపొందారు. కానీ రీ కౌంటింగ్ చేసినప్పుడు.. ఎజాస్ కు 259 ఓట్లు రాగా, బీఆర్ ఎస్ అభ్యర్థి తాహిర్ కు 258 ఓట్లు వచ్చాయి. దీంతో ఒక్క ఓటు తేడాతో ఎజాస్ గెలిచినట్టు అధికారులు ప్రకటించారు.

కొల్లాపూర్ లో..

నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ లో కాంగ్రెస్ అభ్యర్థి ఒక్క ఓటుతో గెలిచారు. 2వ వార్డు చుక్కాయిపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి జయలక్ష్మికి 355 ఓట్లు వచ్చాయి. బీఆర్ ఎస్ అభ్యర్థికి 354 ఓట్లు వచ్చాయి. రీ కౌంటింగ్ చేసినా ఫలితం మారకపోవడంతో.. జయలక్ష్మి ఒక్క ఓటుతో విజయం సాధించారు.

పరకాలలో..

పరకాల మున్సిపాలిటీ 17వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి బొచ్చు సుభద్రకు 369 ఓట్లు వచ్చాయి. బీఆర్ ఎస్ అభ్యర్థి రజినికి 368 ఓట్లు రావడంతో.. రీ కౌంటింగ్ కు గులాబీ నాయకులు పట్టుబట్టారు.

## కల్వకుంట్ల కవిత వర్గం హవా



తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ఫలితాలలో కవిత నేతృత్వంలోని తెలంగాణ జాగృతి నాయకులు ఒక మున్సిపాలిటీని దక్కించుకున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని వడ్డేపల్లి మున్సిపాలిటీలో తెలంగాణ జాగృతి నాయకులు ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ పార్టీ (ఏఐఎఫ్‌బీ) తరఫున ఎన్నికల బరిలో దిగి విజయం సాధించారు. తెలంగాణ జాగృతి నాయకులు ఏఐఎఫ్‌బీ పార్టీ తరఫున మొత్తం 10 వార్డుల్లో పోటీ చేసి 8 స్థానాల్లో విజయం సాధించారు. దీంతో వడ్డేపల్లి మున్సిపాలిటీ ఏఐఎఫ్‌బీ కైవసం చేసుకుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చెరో వార్డును దక్కించుకున్నాయి. ఇప్పటి వరకు వచ్చిన ఫలితాలను పరిశీలిస్తే కాంగ్రెస్ 44, బీఆర్ఎస్ 10 మున్సిపాలిటీలను కైవసం చేసుకున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థులు 884 వార్డులు, బీఆర్ఎస్ 464, బీజేపీ 136, ఇతరులు 137 స్థానాల్లో గెలుపొందారు.

## బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్‌కు బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులు



బాలీవుడ్ ప్రముఖ నటుడు రణ్‌వీర్ సింగ్‌కు బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బెదిరింపులు వచ్చాయి. రణ్‌వీర్‌ను, అతడి దగ్గర పనిచేస్తున్న వారినీ చంపేస్తానని బిష్ణోయ్ అనుచరుడి పేరుతో ఓ దుండగుడు హెచ్చరించాడు. ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టిని కూడా ఇదే తరహాలో బెదిరించాడు. ఈ మేరకు వాట్సాప్‌లో ఓ ఆడియో సందేశం పంపించినట్లు సమాచారం. ఈ బెదిరింపు సందేశంతో బాలీవుడ్ లో కలకలం రేగుతోంది. తనను తాను బిష్ణోయ్ అనుచరుడిగా పేర్కొంటూ హ్యారీ బాక్సర్ అనే వ్యక్తి ఈ బెదిరింపులకు పాల్పడ్డాడు. తన డిమాండ్లను అంగీకరించకపోతే ఆ సెలెబ్రిటీలతోపాటు వారి సిబ్బందినీ హత్య చేస్తామని హెచ్చరించాడు.

## అల్లు శిరీశ్ పెళ్లి సందడి ప్రారంభం

టాలీవుడ్ హీరో, అల్లు అర్జున్ సోదరుడు అల్లు శిరీశ్ పెళ్లి పనులు ప్రారంభమయ్యాయి. నయనికతో అల్లు శిరీశ్ పెళ్లి మార్చి 6న జరగనుంది. గత నెల దుబాయ్‌లో ప్రీ-వెడ్డింగ్ సెలబ్రేషన్స్ ఘనంగా జరిపారు. ఇప్పుడు హైదరాబాద్ లోని అల్లు అరవింద్ ఇంట్లో నిన్న సంప్రదాయబద్ధంగా పసుపు దంచుకునే కార్యక్రమం జరిగింది. సాధారణంగా హల్దీ పేరుతో ఈ ఫంక్షన్లను జరుపుకుంటుంటారు. కానీ, హల్దీ ఫంక్షన్ కు 'నో' చెప్పి... ఇంట్లోనే సంప్రదాయ పద్ధతిలో పసుపు దంచుకునే కార్యక్రమాన్ని నిర్వహించారు.. ఈ వేడుకలో పవన్ కల్యాణ్ భార్య అన్నా లెజినోవా, బన్నీ భార్య స్నేహ, చిరంజీవి పెద్ద కూతురు సుస్మిత, ఇతర బంధువులు, పిల్లలు పాల్గొన్నారు.



## శివరామ్, అన్విరా దేవి.. రామ్‌చరణ్, ఉపాసన కవలల పేర్లు ఇవే!



గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్, ఉపాసన కొణిదెల దంపతులు తమ కవల పిల్లల పేర్లను అధికారికంగా ప్రకటించారు. ఇటీవల తమకు జన్మించిన అబ్బాయికి శివరామ్ అని, అమ్మాయికి అన్విరా దేవి అని నామకరణం చేసినట్లు వెల్లడించారు. జనవరి 31న వీరికి కవలలు (బాబు, పాప) జన్మించిన విషయం తెలిసిందే. 11న హైదరాబాద్‌లోని వారి నివాసంలో అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల మధ్య ఈ చిన్నారుల బారసాల కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రామ్‌చరణ్ ఈ పేర్ల వెనుక ఉన్న అర్థాలను, వాటి ప్రాముఖ్యతను వివరించారు. కుమారుడి పేరు 'శివరామ్'లో శివుడు, రాముడితో పాటు తన తండ్రి చిరంజీవి అసలు పేరు 'శివ శంకర వరప్రసాద్' కూడా కలగలిసి ఉందని తెలిపారు. కుమార్తె పేరు 'అన్విరా దేవి'కి అపరిమితమైన ధైర్యం, దైవికమైన స్త్రీ శక్తి అని అర్థం వచ్చేలా పెట్టామని ఆయన పేర్కొన్నారు. తమ తల్లిదండ్రుల ఆశీస్సులతో, వారి భాగస్వామ్యంతో ఈ పేర్లను ఎంపిక చేశామని చరణ్ అన్నారు. 2023లో జన్మించిన క్లింకారా తర్వాత, చరణ్-ఉపాసన దంపతులకు శివరామ్, అన్విరా రెండో, మూడో సంతానం.